క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం మాఘ మాసం శ్రవణం నక్షత్రం విదియ తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

భీమలింగేశ్వరస్వామికి అభిషేకం


ప్రత్యేకాలంకరణలో స్వామి వారు

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు స్వయంభువుగా వెలసిన భీమలింగేశ్వరస్వామి వారికి విశేష ద్రవ్యాలతో పంచామృతాలతో నిత్యాభిషేకం కార్యక్రమం ప్రారంభించినట్లు ఆదివారం పూజారి సునీల్ శర్మ తెలియజేశారు. ఈ సందర్భంగా సునీల్ శర్మ మాట్లాడుతూ ప్రతి ఏడాది మాఘమాసం మొదలు పాడ్యమి నుంచి మహాశివరాత్రి వరకు స్వామివారికి నిత్యాభిషేకం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్ని స్వామి వారి అభిషేకాలకు సహకరించాలని కోరారు.

పీఎంజేఏవై కార్డుతో ఉపయోగాలు

బల్లికురవ: గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ వలంటీర్ల వద్ద బయోమెట్రిక్ వేసి పీఎంజేఏవై కార్డులు పొందాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని 20 సచివాలయాల్లో 19,566 మంది పీఎంజేఏవై కార్డులు పొందాల్సి ఉండగా ఇప్పటికి 16 వేల మంది మాత్రమే కార్డులు పొందారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్డుతో దేశంలో ఎక్కడైనా రూ.5 లక్షల వైద్యంతోపాటు రూ.2 లక్షల వరకు బీమా పొందవచ్చని చెప్పారు. వ్యవసాయ పనులు రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లిన రైతులు, కూలీలు వలంటీర్ల వద్ద బయోమెట్రిక్ వేసి కార్డులను పొందాలని ఎంపీడీవో తెలిపారు.

ఇండ్ల నిర్మాణాలు తప్పనిసరి

బల్లికురవ: ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీలు, సొంత స్థలాలకు మంజూరు చేసిన పక్కా గృహాలను తక్షణమే నిర్మాణ పనులు చేపట్టాలని హౌసింగ్ ఏఈ ఎం దుర్గా రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 20 సచివాలయాలకు 621 ఇళ్లు మంజూరు కాగా, ఇంకా 238 మంది ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. చేపట్టకపోతే ప్రభుత్వం ఇచ్చిన పట్టా, ఇల్లు రద్దు అవుతుందని చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.8 లక్షల నగదు, మెటీరియల్ అందజేస్తున్నట్లు చెప్పారు. బిల్లు చెల్లింపులోనూ జాప్యం లేదని ఏఈ వివరించారు.

రైల్వే ట్రాక్ పక్కన మృతదేహం లభ్యం


రైల్వే ట్రాక్ పక్కన పడి ఉన్న మృతదేహం

వేటపాలెం: వేటపాలెం రైల్వే స్టేషన్‌కి దక్షిణం వైపున రైల్వే ట్రాక్ పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. మృతుడికి 60 సంవత్సరాలు ఉంటుందని, తెల్ల జుట్టు, రంగుల చొక్కా, పచ్చకలర్ లుంగీ ఉందని చెప్పారు. రైల్లో ప్రయాణిస్తూ గేటు వద్ద నుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.

సంప్రదాయాలు సంస్కృతికి పునాదులు


మాట్లాడుతున్న తులసి సూర్యప్రకాశ్

మార్కాపురం టౌన్: హిందూ సమాజంలో అనేక కులాల సంప్రదాయలు, హిందూ సంస్కృతికి పునాది వంటివని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత కార్య, కారిణి సభ్యులు తులసి, సూర్య ప్రకాశ్ అన్నారు. పట్టణంలోని షిర్డీ సాయి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మార్కాపురం గ్రామీణ ఖండ సద్భావన సమావేశంలో మాట్లాడారు. అన్య మతస్తులు హిందు మతంపై చేస్తున్న దాడులను సమర్థవంతగా ఎదుర్కోవాలని తెలిపారు. విభాగ్ సంపర్క్ ప్రముఖ్ చెంచురామయ్య, ప్రతినిధులు కొండా మల్లికార్జున రెడ్డి, పి. శ్రీనివాస్, కాలం రాజు రామక్రిష్ణ, జింకా రామ్‌గోపాల్, సూర్యనారాయణ , శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి భరోసా

- రెండు పీహెచ్‌సీలకు రూ.3.05 కోట్లతో పక్కా భవనాలు
- వేటపాలెం పీహెచ్‌సీ భవన నిర్మాణం పూర్తి. త్వరలో పందిళ్లపల్లి పీహెచ్‌సీ
- 120 ఏళ్ల నాటి బ్రిటీష్ కట్టడంలో పీహెచ్‌సీ విధుల నిర్వహణ
- 24 గంటలు ప్రజలకు సత్వర వైద్యం


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పీహెచ్‌సీ నూతన భవనం

వేటపాలెం: కాలం మారింది.. తరాలు మారాయి. పాలకులు మారారు.. కానీ ప్రజలకు అందించే మౌలిక వసతులను మాత్రం పక్కనపెట్టేశారు. కేవలం సొంతలాభం చూసుకున్నారే కానీ ప్రజలకు అవసరమయ్యే వైద్యాన్ని గాలికొదిలేసింది గత ప్రభుత్వం. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి అన్నీ హామీలు నెరవేరుస్తూ ప్రజల మోముల్లో ఆనందాన్ని నింపుతున్నారు సీఎం వైఎస్‌ జగన్ మోహన్‌రెడ్డి. విద్య ఎంత ముఖ్యమో వైద్యం కూడా అంతే ముఖ్యమని తలచి నాడునేడు తరహాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలకు కంకణం కట్టుకున్నాడు. ఎప్పుడో బ్రిటిష్ కాలం నాటి భవనంలో కొనసాగుతున్న పీహెచ్‌సీల భవనాల స్థానంలో కొత్త భవనాలు, సౌకర్యాలు ఏర్పాటు చేసి వైద్యోనారాయణో హరి అనిపించుకుంటున్నాడు సీఎం జగన్. వేటపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 120 ఏళ్ల క్రితం బ్రిటీష్ వారి హయాంలో నిర్మించారు. కప్పు పాడై పోవడంతో వర్షం నీరుకారుతూ బలహీనపడి శిథిలావస్థకు చేరినా నాటి పాలకులకు ఉన్నతాధికారులకు పట్టలేదు. అదే శిథిల భవనంలో వైద్యులు ప్రజలకు వైద్యం చేస్తున్నారు. ప్రజా సంక్షేమం దృష్ట్యా పేద ఆరోగ్యానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. రూ.1000 ఖర్చు దాటితే వైద్య సేవలన్నింటికీ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చారు. ప్రతి గ్రామంలో 24 గంటలు వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నూతన భవనాలు నిర్మాణం చేపట్టారు. స్థానిక వేటపాలెం మండల పరిషత్ ప్రాంగణలో రూ. 1.75 కోట్ల నిధులతో నూతనంగా పీహెచ్‌సీ భవనం నిర్మించారు. భవన నిర్మాణం పనులు పూర్తియ్యాయి. నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని త్వరలో ప్రారంభించనున్నారు. ఈ భవనం వినియోగంలోకి వచ్చిన వెంటనే పీహెచ్‌సీలో 24 గంటల వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి.


పురాతన పెంకుటింటిలో ప్రస్తుత పీహెచ్‌సీ

పందిళ్లపల్లిలో..

పందిళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం నిర్మాణానికి ప్రభుత్వం రూ. 1.75 కోట్లు మంజూరు చేసింది. అయితే గ్రామంలో నూతన భవన నిర్మాణానికి సరిపడా స్థలం లేక పోవడంతో ఇంకా భవన నిర్మాణం పనులు చేపట్టలేదు. ప్రస్తుతం వైద్యశాల నిర్వహిస్తున్న స్థలంలోనే నూతన భవన నిర్మించడానికి ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపిచారు. ఉన్నత అధికారుల నుంచి అనుమతులు రాగానే భవన నిర్మాణాన్ని ప్రారంభించనున్నారు.

త్వరలో పీహెచ్‌సీ నూతన భనాన్ని ప్రారంభిస్తాం..

పీహెచ్‌సీ భవన నిర్మాణం పూర్తి అయింది. రెండోది పందిళ్లపల్లిలో పీహెచ్‌సీ నూతన భవనానికి నిధులు మంజూరయ్యాయి. కానీ సరిపడా స్థలం అందుబాటులో లేక పోవడంతో భవన నిర్మాణం చేపట్టలేదు. ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీ ప్రాంతంలో నూతన భవన నిర్మించడానికి ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. రాగానే నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

– నరశింహులు, ఆర్‌అండ్‌బీ డీఈ చీరాల

పూర్తిగా వైద్యసేవలు అందుబాటులోకి తెస్తాం..



ప్రస్తుతం పురాతన పెంకుటింటిలో వైద్యశాల కొనసాగుతోంది. ప్రస్తుతం నూతనంగా నిర్మించిన భవనం అందుబాటులోకి వస్తుంది. భవనం ప్రారంభించగానే పూర్తి స్థాయిలో 24 గంటలు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువస్తాం. గర్భిణులకు ప్రసవాలు, కుటుంబ నియంత్ర శస్త్రచికిత్సలు ఇక్కడే చేస్తాం.

– బాలరాజు, వైద్యాధికారి, వేటపాలెం

ప్రతి విద్యార్థి ప్రభుత్వ బడుల్లోనే చదవాలి


విద్యా సదస్సులో మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యం

పర్చూరు: అమెరికా వంటి పాశ్చాత్య దేశాల్లో ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చదివిస్తారని, మన దేశంలో మాత్రం ప్రజలు తమ పిల్లలను అనేక రకాల పాఠశాలల్లో చదివిస్తున్నారని పీడీఎఫ్ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రం పర్చూరు అద్దంకి నాంచారమ్మ కల్యాణ మండపంలో నిర్వహించిన పర్చూరు ప్రాంతీయ మండలాల విద్యా సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. మన దేశంలోను అమెరికా మాదిరిగా కామన్ స్కూల్ విధానం అమలు అవ్వాలన్నారు. నూతన విధానంలో వస్తున్న మార్పులను బట్టి ప్రతి ఉపాధ్యాయుడు మంచి నైపుణ్యంతో సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రైవేటు విద్యా విధానంతోనే అనేక ప్రాంతాల్లో రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితులున్నట్లు సర్వేలు చెప్తున్నాయన్నారు. పంటలు నష్టపోవడంతో అప్పులు పాలయ్యేవారని, దీంతో వారు తమ పిల్లలకు స్కూల్, కాలేజీ ఫీజులు కట్టలేని పరిస్థితుల్లోనే ఆత్మహత్యలకు పాల్పడేవారన్నారు. కామన్ స్కూల్ విద్యా, విధానం వుండటం వలన అనేక మార్పులు వస్తాయన్నారు. కార్యక్రమంలో తూర్పు, రాయలసీమ పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పీ బాబు రెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజీ శ్రీనివాసరావు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీ రమాదేవి, పర్చూరు డిప్యూటీ డీఈవో ఏ కిరణ్ కుమార్, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోళ్లు షురూ

- నాలుగు చోట్ల కొనుగోలు కేంద్రాలు
- 100 టన్నుల వరకు వరి కొనుగోళ్లు పూర్తి


కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేస్తున్న సిబ్బంది

అద్దంకి: రాష్ట్ర ప్రభుత్వం రైతులు దళారుల వద్ద ధాన్యం అమ్మి నష్టపోకుండా మద్దతు ధర కల్పించడం కోసం ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను ప్రారంభించింది. మండలంలోని ధర్మవరం, శంఖవరప్పాడు, మోదేపల్లి, మణికేశ్వరం గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. మణికేశ్వరం, మోదేపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో, ధర్మవరం, శంఖవరప్పాడులో టుబాకో అసోసియేషన్ ధాన్యాన్ని కొనుగోలు చేస్తోంది. ఆయా కేంద్రాల్లో ఇప్పటికే వంద టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ ఆదివారం తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్ చేయించుకున్న రైతులు తమ ధాన్యం శాంపిల్‌ను కొనుగోలు కేంద్రంలో చూపిస్తే తేమ శాతం 17 కన్నా తక్కువ ఉంటే కొనుగోలు చేస్తారని చెప్పారు. ధాన్యం విక్రయించుకునే రైతులకు ఉచితంగా గోతాలు, ధాన్యం రవాణా బాడుగతోపాటు, కాటా కూలి రూ.50 ప్రభుత్వం ఇస్తుంది. నగదును 21 రోజుల్లో ఆధార్ లింక్ అయిన రైతు వ్యక్తిగత ఖాతాకు జమ చేస్తారు. ఏ గ్రేడ్ బస్తా (75 కిలోలు) వరి ధాన్యానికి రూ.1545, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.1530 చెల్లిస్తారు. తాలు తీసే ప్రక్రియకు అయిన ఖర్చు రైతే చెల్లించాల్సి ఉంటుంది. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ఏవో కోరారు.

ఈర్ల గంగమ్మకు భక్తుల పొంగళ్లు


పొంగళ్లు పెడుతున్న భక్తులు

- ఆలయంలో భక్తుల కోలాహలం
- రూ.20 లక్షలతో సీసీ రహదారి నిర్మాణ పనులు


ఏర్పాటు చేసిన శివకుటుంబం విగ్రహాలు

బల్లికురవ: మాఘమాసం ప్రారంభం మొదటి ఆదివారం సందర్భంగా మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలోని ఈర్ల గంగమ్మ ఆలయం వివిధ గ్రామాల్లోని భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తూ బల్లికురవ, కొత్తపాలెం, నక్కబొక్కలపాడు, కొండాయపాలెం, చెన్నుపల్లి, కొత్తమల్లాయపాలెం, పాతమల్లాయపాలెం, కొప్పరపాలెం గ్రామాల్లోని భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నివేదించి, తమ మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయ అభివృద్ధి..

ఇటీవలి కాలంలో నక్కబొక్కలపాడు గ్రామస్తులు ఈర్లకొండ గ్రానైట్ వ్యాపారుల సమష్టి కృషితో సుమారు రూ.50లక్షలతో ఆలయాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. ఆలయం ముందు వేదిక ఏర్పాటుతోపాటు, శివపార్వతుల కుటుంబం , కళ్యాణకట్ట, భక్తుల విశ్రాంతి భవనాన్ని నిర్మించారు. ఆలయానికి వెళ్లే దారిని సీసీ రోడ్డుగా మార్చేందుకు ఇటీవలే మండల నిధులు రూ.20 లక్షలు కేటాయించారు. బల్లికురవ నుంచి సంతమాగులూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి ఆలయం వరకు మట్టి రోడ్డును సిమెంట్ రోడ్డుగా మార్చేందుకు రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య నిర్మాణ పనులకు ఇటీవల భూమి పూజ చేశారు. సర్పంచ్ ధూళిపాళ్ల రామయ్య ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. సిమెంట్ రోడ్డుగా మార్చడం వల్ల వర్షాకాలంలోనూ అమ్మవారిని దర్శించుకునే భక్తులకు సౌకర్యంగా ఉంటుందని సర్పంచ్ తెలిపారు.

నేడు మార్టూరులో ఆమంచి పర్యటన

మార్టూరు: వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ సోమవారం మండలంలో పర్యటించనున్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్న ఆమంచి ప్రజల నుంచి సమస్యలను వింటారన్నారు. సమస్యలను ఆయన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారని, మొదటిసారిగా పర్యటిస్తున్న తరుణంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

నేడు కారంచేడులో స్పందన

కారంచేడు: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహిస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దారు పీ. సుశీలాదేవి తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు, విద్యార్థులు తమ అవసరాలపై అర్జీలు పెట్టుకోవచ్చన్నారు. కార్యక్రమానికి మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని ఆమె కోరారు. హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలుంటాయని ఆమె తెలిపారు.

సేవలు అందించడంలో రోటరీ ముందంజ


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

పర్చూరు: సమాజంలోని పేదవర్గాలకు సేవలు అందించడంలో రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ముందంజలో ఉంటుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం అడుసుమల్లి గ్రామంలోని శబరి గిరిజన వృద్ధాశ్రమంలోని 30 మంది వృద్ధులకు దుప్పట్లు పండ్లు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలకు నిర్వాహకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, రోటరీ సభ్యులు నరిశెట్టి విపిన్‌బాబు, కొల్లా సుబ్బారావు, పాబోలు వెంకటేశ్వర్లు, ఆశ్రమ నిర్వాహకులు, వృద్ధులు పాల్గొన్నారు.

25లోపు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

బల్లికురవ: రైతులు రబీలో సాగు చేసిన పంటలన్నింటికీ ఈ నెల 25లోపు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారిణి ఎస్‌వీపీ కుమారి ఆదివరం ప్రకటనలో తెలిపారు. ఈ-క్రాప్ నమోదు చేసుకుంటే పంటల బీమా ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ, ప్రభుత్వ పథకాలు పంట ఉత్పత్తులను విక్రయించుకోవచ్చని చెప్పారు. పీఎం కిసాన్ 13వ విడత సాయం పొందేందుకు ఈ-కేవైసీ తక్షణమే చేయించుకోవాలని ఏవో చెప్పారు.

అద్దంకి: మండలంలోని రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏవో కొర్రపాటి వెంకట కృష్ణ కోరారు. ఈ-కేవైసీ చేయించుకుంటేనే రైతు భరోసా నగదు ఖాతాలకు జమ అవుతుందని చెప్పారు. ఈ-కేవైసీ చేయించుకోవడానికి మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉందని, ఆధార్ లింక్ అయి ఉంటే మండల వ్యవసాయ కార్యాలయంలో ఈ-కేవైసీ ఉచితంగా చేస్తున్నట్లు చెప్పారు. మీ-సేవ, లేదా సెల్‌ఫోన్‌లోనూ ఈ-కేవైసీ చేయించుకోవచ్చన్నారు.

చదవడంతో మరింత విజ్ఞానం


పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

అద్దంకి: చదవడంతో విస్తృత జ్ఞానం పొందవచ్చని సంతమాగులూరు గ్రంథపాలకుడు బాదం భాస్కర రెడ్డి అన్నారు. చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆయన ఆదివారం గ్రంథాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులకు వివిధ పుస్తకాలు ఇచ్చి చదివించారు.

ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఖాళీ సమయాల్లో సెలవు రోజుల్లో గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు తరగతి పుస్తకాలను ఉచితంగా చదువుకోవచ్చని చెప్పారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

ఘనంగా గుంటి గంగా భవాని పూజలు


అలంకరణలో గుంటి గంగా భవాని అమ్మవారు


మార్కాపురం: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తాళ్లూరు: గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివాకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. విజయలక్ష్మి, ప్రకాశరావు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఆలయానికి రూ. 16,632 ఆదాయం వచ్చినట్లు ఆర్‌ఏ శ్రీనివాసరావు తెలిపారు. సౌకర్యాలను ఆలయ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, ఈఓ భాస్కర్ రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, సహస్రనామ పూజలు, కుంకుమపూజలు, అఖండహారతులు జరిగాయి. బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మార్కాపురం: పట్టణ శివారులోని గుండ్లకమ్మ నది ఒడ్డున ఉన్న లక్ష్మీపద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రవణ నక్షత్ర సందర్భంగా భక్తి శ్రద్ధలతో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఉభయ దాతలు పట్టు వస్త్రాలు సమర్పించారు. చక్కా మాలకొండ నరసింహారావు, ఆర్‌కేజే నరసింహం, రామక్రిష్ణ తదితరులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఆటపాటలతో చిన్నారుల జోష్


నృత్యాలు చేస్తున్న చిన్నారులు


చిన్నారులను ఊయలలూగిస్తున్న తల్లిదండ్రులు

చీరాల రూరల్: ఆదివారం స్కూళ్లకు సెలవు దినం కావడంతో చిల్డ్రన్స్ పార్కు చిన్నారుల కేరింతలతో ఆదివారం రాత్రి దద్దరిల్లింది. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పార్కులో చిన్నారుల కోసం ప్రత్యేకంగా స్టేజి, డీజే, విద్యుత్ అలంకరణతో ఏర్పాటు చేశారు. ఆదివారం చిన్నారులను తల్లిదండ్రులు ఆట విడుపు కోసం పార్కుకు తీసుకొచ్చారు. సినిమా పాటలు డీజే సౌండ్స్‌తో చిన్నారులు ఎంతో ఆనందోత్సాహాల మధ్య నృత్యాలు చేశారు. దీంతో ఆప్రాంతమంతా సందడి వాతావరణం నెలకొంది.

ఓంకార క్షేత్రంలో ప్రత్యేక పూజలు


అలంకరణలో స్వామివార్లు

చీరాల అర్బన్: చీరాల కొత్తపేట ఐఎల్‌టీడీ కాలనీలోని ఓంకార క్షేత్రంలో నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దేవాలయంలో రాజగోపురం, కాలభైరవ, చండీశ్వర, దక్షిణామూర్తి, రాహు కేతువులు, బలిపీఠాలను ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా కొత్తపేటలోని పురవీధుల్లో విగ్రహాలను మేళతాళాలతో నగరోత్సం నిర్వహించారు. ఈనెల 27వ తేదీ వరకు పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు టి.సత్యనారాయణ, కార్యదర్శి ఎం.రామకృష్ణ శర్మ, జీవీ లక్ష్మీరమణలు తెలిపారు. కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

సీఎం కప్ టెన్నిస్ లీగల్ పోటీలు ప్రారంభం

గిద్దలూరు రూరల్: శాప్ జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సీఎం కప్ టెన్నిస్ లీగల్ పోటీలను పట్టణంలోని టెన్నిస్ కోర్టు ఆవరణలో ఆదివారం జిల్లా లాన్ టెన్నిస్ అధ్యక్షుడు డా.జి.కె.మోహన్‌రెడ్డి, గిద్దలూరు లాన్ టెన్నిస్ అధ్యక్షుడు డా.సి.హెచ్.రంగారెడ్డి ప్రారంభించారు. డాక్టర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 10 నుంచి 16 సంవత్సరాల వయస్సు గల బాల బాలికలకు ఈ పోటీలను ప్రారంభించినట్లు తెలిపారు. 5 మంది బాలురు, 5 మంది బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. రెండు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. టెన్నిస్ కార్యదర్శి వీరరాఘవులు, కోచ్ మురళీ మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శివప్రసాద్, కోశాధికారి ఖాదర్ బాష, నిర్వాహకులు పాల్గొన్నారు.

క్రికెట్ విన్నర్ పొట్టిపల్లె టీం

కొమరోలు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సంక్రాంతి పురస్కరించుకుని గిద్దలూరు తాలూకా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలను దాదాపు 10 రోజులపాటు నిర్వహించగా 25 టీంలు పోటీపడ్డాయి. పొట్టిపల్లె రామక్రిష్ణ టీం, పామూరుపల్లె భాస్కర్ టీంలు ఫైనల్స్‌కు చేరుకుని తలపడగా పొట్టిపల్లె రామక్రిష్ణ టీం విన్నర్‌గా నిలిచింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కొమరోలు జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు రూ. 30 వేల నగదు బహుమతిని అందించగా రన్నర్‌గా నిలిచిన పామూరుపల్లె భాస్కర్ టీంకు 20 వేల రూపాయలు, తృతీయ బహుమతి శివాజీనగర్ శేఖర్ టీమ్‌కు 10 వేల రూపాయలు అందించారు. వైస్ ఎంపీపీ షేక్ మౌలాలి, ఎంపీటీసీలు షేక్ సుభాని, తిరుమలరాజు, వెంగయ్యచౌదరి, రమణరెడ్డి పాల్గొన్నారు.